# మా అబ్బాయి మాటలతో నా మనసు గాయపడింది

**న్యూఢిల్లీ:** భారత వాహన దిగ్గజం రాహుల్ బజాజ్ మనసుకు గాయమైంది. హమారా బజాజ్ అంటూ భారతీయుల గుండెల్లోకి దూసుకెళ్లిన ఈ నినాదం ఇక వినిపించదన్న కుమారుడి నిర్ణయంతో కలత చెందారు. ఒక బ్రాండ్‌ను కొడుకులా పెంచి పోషించిన ఆయన సొంత కొడుకు చేతలకు ఖంగుతిన్నారు. స్వయానా ఆయనే ఓ టీవీ ఇంటర్వ్యూలో ఈ విషయం వెల్లడించారంటే రాహుల్ మనసు ఎంత బాధపడిందో ఊహించవచ్చు.

### ఏం జరిగిందంటే

బజాజ్ ఆటో 1980-90ల్లో 'హమారా బజాజ్' అంటూ ప్రచార కార్యక్రమాల్లోనే విప్లవానికి నాంది పలికింది. అప్పట్లో అది ఎంతో ప్రాచుర్యం పొందింది. ప్రస్తుతం మాత్రం గేర్‌లెస్ స్కూటర్ క్రిస్టల్ మాత్రమే కంపెనీ విక్రయిస్తోంది. కొన్నేళ్ల క్రితం రూ. 8,500 కోట్ల గ్రూపునకు ఎండీగా పగ్గాలు చేపట్టిన రాజీవ్ బజాజ్ వారం క్రితం ఓ కీలక నిర్ణయం తీసుకున్నారు. అదేమిటంటే ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో స్కూటర్ల ఉత్పత్తిని నిలిపివేయాలని. మోటర్‌సైకిళ్ల విభాగంలో వృద్ధిని పెంచడం



కోసమే ఇలా చేస్తున్నట్లు ఆయన వివరించారు. ఇది తండ్రి రాహుల్ బజాజ్‌కు నచ్చలేదు. 'చేయకూడని పనిచేసి కంపెనీకి, వాటాదార్లకు హాని చేయడంపై నేనేమీ చెప్పలేను.. ఆయన(రాజీవ్) నాకు వివరించడానికి ప్రయత్నించారు కానీ ఇప్పటికీ నాకు ఆ విషయం జీర్ణం కావడం లేద'ని ఒక టీవీ ఇంటర్వ్యూలో రాహుల్ పేర్కొన్నారు. 'నేను చాలా బాధపడ్డా.. నాకు గాయమైందని భావిస్తా'నని భావోద్వేగంతో మాట్లాడారు. తండ్రి మాటలకు స్పందిస్తూ 'నేను భావోద్వేగాల కంటే తార్కికతకు ప్రాధాన్యం ఇస్తాను. పరిష్కారాల కోసం చూస్తాను' అని రాజీవ్ అన్నారు.